క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా ఉంటా
సర్నాల తిరుపతిరావు



మైలవరం: 2024 జనరల్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, పార్టీ అనుబంధ సంఘాల వారికి మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త సర్నాల తిరుపతిరావు గురువారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. మూడు నెలలు తమతో నడిచి అండగా ఉన్న ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలు, ప్రజలకు అండగా ఉంటామని, పార్టీ కోసం పనిచేస్తామని చెప్పారు.

సౌర కుటుంబంపై విద్యార్థులకు అవగాహన



మైలవరం: మైలవరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం కొనసాగుతోంది. దీనిలో భాగంగా సౌర కుటుంబంపై విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిలుకూరివారిగూడెం ఎస్ఏఎస్ఆర్ జెడ్పీహెచ్ స్కూల్ ఉపాధ్యాయుడు డీవీఎస్ శివవరప్రసాద్ మాట్లాడుతూ సౌర కుటుంబం –మన విశ్వంలో మనం నివసించే భూమి ఒక గ్రహం అని, ఆ భూమిని ఏ విధంగా పరిరక్షించాలి అనే విషయాలను వివరించారు. మిగిలిన గ్రహాలలో జూపిటర్ పరిమాణం భూమి పరిమాణానికి ఎన్నో రెట్లు అధికంగా ఉంటుందని గణాంకాలతో సహా వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల వేలం నిలిపి వేయాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రభుత్వ స్థలాల అమ్మకాలు నిలిపివేయాలని సీఐటీయూ కొండపల్లి పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ డిమాండ్ చేశారు. కొండపల్లిలో బీఎస్ఎన్ఎల్ స్థలం అమ్మకానికి ఈవేలం ప్రకటన విడుదల చేయడం దుర్మార్గమని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 13 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు ఈ టెండర్‌కు పిలుపు ఇవ్వడం దారుణమన్నారు. ప్రభుత్వ ఆస్తులను ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ పోస్టాఫీస్ భవనం ఆ స్థలంలో నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో ఏర్పడనున్న కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకుని కేంద్రం ప్రభుత్వం, బీఎస్ఎన్ఎల్ యాజమాన్యంతో చర్చించి ఈ–టెండర్ రద్దు చేయించాలని ఆయన డిమాండ్ చేశారు.

పేపర్ క్రాఫ్ట్ తయారీలో విద్యార్థులకు శిక్షణ



తిరువూరు: స్థానిక గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం శుక్రవారం ఉదయం జరుగుతుందని గ్రంథాలయాధికారి పద్మావతి తెలిపారు. గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తక పఠనం, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్ తయారీ, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించామని పద్మావతి తెలిపారు. ముగింపు కార్యక్రమానికి విద్యార్థినీ విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

వైభవంగా రామాలయ వార్షికోత్సవం



తిరువూరు: తిరువూరు శివారు పీటీకొత్తూరులోని సీతారామచంద్రస్వామి ఆలయ 13వ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. తెల్లవారు ఝామున పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు, సంకీర్తన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అంబటి వెంకటనారాయణరెడ్డి, ఆలయ అర్చకుడు ఈశ్వరప్రగడ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాలు ధ్వంసం



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడు గ్రామంలో జెడ్పీ హైస్కూల్ వద్ద సీసీ రోడ్డు ప్రారంభానికి సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. శిలాఫలకాలను పగుల కొట్టి ముక్కలు ముక్కలు చేశారు. దీనిపై సర్పంచ్ బి. జ్యోతిబ్రహ్మం ఆవేదన వ్యక్తం చేశారు.

ఆలయాలకు నిలయం నూజివీడు

అయ్యప్పస్వామి ఆలయం



జ్ఞాన సరస్వతి ఆలయం



నూజివీడు: నూజివీడు పట్టణంలోని అడవి ఆంజనేయస్వామి చెరువు ప్రాంతం ఆలయాలకు నిలయంగా విలసిల్లుతోంది. నూజివీడు జమీందారులు పూర్వం అడవి ఆంజనేయస్వామి ఆలయాన్ని ఏర్పాటు చేయగా, అదే ప్రాంతంలో గత 35 ఏళ్లుగా పలు ఆలయాలను స్థాపించారు. ఇక్కడే ప్రసిద్ధి చెందిన శ్రీజ్ఞాన సరస్వతి ఆలయం ఉంది. దీనిని పోతినేని గోపాలం అనే వ్యక్తి ప్రజల విరాళాలతో నిర్మించారు. ఆలయం నిర్మించిన నాటి నుంచి ఆయన పేరు గుడి గోపాలంగా మారింది. ఈ ఆలయానికి ప్రతి రోజూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల తల్లిదండ్రులు తమ పిల్లలను అక్షరాభ్యాసం కోసం ఇక్కడికి తీసుకు వస్తున్నారు. మూలా నక్షత్రం రోజున రాష్ట్రంలోని నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు వచ్చి తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించుకుంటున్నారు. ఇక్కడే శ్రీ అయ్యప్పస్వామి ఆలయం కొలువుదీరింది. శబరిమలలో ఉన్న విధంగా ఇక్కడ ఆలయాన్ని నిర్మించారు. దీంతో ఇది భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. డిసెంబర్ నెల ప్రారంభం నుంచి సంక్రాంతి వరకు ఇక్కడ ప్రతి రోజూ మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. ఇదే ప్రాంగణంలో శ్రీ అష్టలక్ష్మి అమ్మవారు, శ్రీ ధన్వంతరి ఆలయం, శ్రీ షిర్డీ సాయి, శ్రీ సత్యసాయి మందిరాలు సైతం కొలువుదీరాయి.



అష్టలక్ష్మి ఆలయం



ధన్వంతరిస్వామి ఆలయం



అడవి ఆంజనేయస్వామి ఆలయం

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ

ఇబ్రహీంపట్నం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని శాంతివన్ యోగా ఫౌండేషన్ అధ్యక్షుడు లంకే జనార్దన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎ.కాలనీ ఎస్వీసీటీ కల్యాణ మండపంలో శ్రీ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ తరగతులు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఆరు నుంచి 7.15 గంటల వరకు జరుగుతాయన్నారు. దేహశుద్ధికి షట్‌క్రియలపై అవగాహన, సూక్ష్మ వ్యాయామాలు, ఆసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ముద్రలు, వివిధ ధ్యాన పద్ధతులలో శిక్షణ ఇస్తారని చెప్పారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇతర వివరాలకు సెల్: 63014 54859 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి



ఏఎంహెచ్ఓ డాక్టర్ రామకోటేశ్వరరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని ఏఎంహెచ్ఓ డాక్టర్ వి.రామకోటేశ్వరరావు సూచించారు. స్థానిక ముత్యాలంపాడులో గురువారం ఆయన వర్షాకాలం ప్రారంభం అయిన దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. చెత్తచెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా ఇంటికి వచ్చిన పారిశుద్ధ్య సిబ్బందికి మాత్రమే ఇవ్వాలని, పారిశుద్ధ్య సిబ్బంది సూచించిన ప్రాంతాలలోనే చెత్త వేయాలని అన్నారు. ముఖ్యంగా మురుగు కాలువలు, కాలువలలో చెత్త వేయటం వల్ల మురుగు నిలిచి పోయి దుర్వాసనతో పాటు దోమలు పెరిగిపోయే ప్రమాదం ఉందన్నారు. ఏ అనారోగ్య సమస్యలు వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా ఇంటికి వచ్చిన ఆరోగ్య కార్యకర్తలకు సమాచారం ఇవ్వాలని, ఆరోగ్యకేంద్రం సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, తద్వారా దోమలు పెరగకుండా నియంత్రించ వచ్చని ఆయన వివరించారు.

భక్తిశ్రద్ధలతో బాబావారి పాదుకలకు పూజలు



బాబావారి పాదుకలతో మహల్సాపతి మునిమనుమడు శ్రీకాంత్, వీరమోహనరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం బాబావారు స్వయంగా ధరించిన పాదుకలకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. షిర్డీ నుంచి మహల్సాపతి ముని మనుమడు శ్రీకాంత్ బాబా వారు స్వయంగా ధరించిన పాదుకలను మందిరానికి తీసుకువచ్చారు. మందిర వ్యవస్థాపకులు తంగెళ్లమూడి వీర మోహనరావు, భక్తులు బాబావారి పాదుకలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబా వారి పాదుకలను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మహల్సాపతి ముని మనుమడు శ్రీకాంత్ మాట్లాడుతూ శ్రీదత్తసాయి మందిర వ్యవస్థాపకులు తంగెళ్లమూడి వీరమోహనరావు కోరిక మేరకు బాబావారి పాదుకలను నగరానికి తీసుకువచ్చామన్నారు. బాబా వారు స్వయంగా ధరించిన పాదుకలను బాబా భక్తులు దర్శించుకునేలా ఏర్పాటు చేశామన్నారు. తంగెళ్లమూడి మోహనరావు మాట్లాడుతూ బాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలనే ఉద్దేశంతో బాబావారు స్వయంగా ధరించిన పాదుకలను తీసుకువచ్చి భక్తుల దర్శనార్థం ఉంచామని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

● బొమ్మలండీ.. బొమ్మలు





బొమ్మలండీ...బొమ్మలు...అందమైన బొమ్మలు...భలే భలే బొమ్మలు.. మన ఇంట్లో పసిపాపల్లాంటి బొమ్మలు... జీవం ఉట్టిపడే బొమ్మలు... గడప దాటి బయటకు వచ్చేవరకు పిల్లలకు ప్రియనేస్తాలు ఈ బొమ్మలే...

నగరంలో కృష్ణలంక సమీపంలో అందమైన బార్బీ డాల్స్ బొమ్మలు విక్రయిస్తున్నారు. ఇవి చూపరులకు కనువిందు చేస్తున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

10న హుండీ కానుకల లెక్కింపు

విస్సన్నపేట: పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో భక్తులు అమ్మవారికి సమర్పించిన హుండీ కానుకలను ఈ నెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు లెక్కిస్తామని ఆలయ ఈఓ వై. సీతారామయ్య గురువారం తెలిపారు. దేవదాయ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీస్ అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీ కానుకలను లెక్కిస్తామని చెప్పారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థినుల ఎంపిక

ఆగిరిపల్లి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో 8వ తరగతి చదివిన నలుగురు విద్యార్థినులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ (ఎన్ఎంఎంఎస్) స్కాలర్ షిప్‌నకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయిని పుష్పలత తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందించే ఈ స్కాలర్ షిప్‌కు రాత పరీక్ష ద్వారా 8వ తరగతి చదువుతున్న గంటా యామిని, కొండా భవ్య శ్రీ, సురోజు ప్రణవి, సత్తా షైనీప్రియ ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థినులను ఆమె అభినందించారు.

నర్సరీల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి



అడవిరావులపాడులో నర్సరీని పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారి నీలిమ

నందిగామ: మిరప నారు పెంచే నర్సరీల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఉద్యాన శాఖాధికారి నీలిమ అన్నారు. మండలంలోని అడవిరావులపాడు ప్రాంతంలో ఏర్పాటు చేసిన షెడ్ నెట్ నర్సరీలను గురువారం ఆమె పరిశీలించారు. నిర్వాహకులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖాధికారి నీలిమ మాట్లాడుతూ షెడ్ నెట్ నర్సరీ నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని లేదంటే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా పెంచేనారుకు సంబంధించిన విత్తనాల బిల్లులతోపాటు నర్సరీకి సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో ఉంచాలన్నారు. షెడ్ నెట్ నర్సరీల బెడ్ల పక్కన నీలి, పసుపు రంగు జిగురు పూసిన అట్టలు ఏర్పాటు చేసుకోవాలని, అక్కడక్కడా బంతి మొక్కలు నాటుకోవాలని సూచించారు.

విద్యార్థుల అప్రెంటీస్ షిప్‌నకు అనుమతి

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం బీబీఏ లాజిస్టిక్స్ విద్యార్థులకు హైదరాబాద్ జిలాగ్ లాజిస్టిక్స్ కంపెనీ, చెన్నైలోని లాజిస్టిక్స్ స్కిల్ కౌన్సిల్‌లో ఒక సంవత్సరం పాటు అప్రెంటీస్‌షిప్ చేయడానికి అనుమతి లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. తమ కళాశాలలో కంపెనీల యాజమాన్యంతో గురువారం జరిగిన అవగాహనా సదస్సులో తమ కళాశాల విద్యార్థులకు లాజిస్టిక్స్ కంపెనీలో ఎలా పనిచేయాలి అనే అంశంపై శిక్షణ ఇచ్చారన్నారు. ఐదుగురు విద్యార్థులకు డీహెచ్ఎల్ కంపెనీలో, ఆరుగురు విద్యార్థులకు హైదరాబాద్ ఫ్లిప్‌కార్ట్ కంపెనీలో అప్రెంటీస్‌షిప్ ఏర్పాటు చేశామన్నారు. వీరు అన్ని సదుపాయాలతో కలిపి ప్రతి నెలా రూ.15 వేల వేతనం పొందుతారని చెప్పారు. లాజిస్టిక్ కంపెనీ ఎన్టీఆర్ జిల్లా ప్రతినిధి సుధా మాట్లాడుతూ బీబీఏ లాజిస్టిక్స్ చదివే విద్యార్థులు మూడో ఏడాది నుంచి చదువుతో పాటు కంపెనీలో పని చేయవచ్చన్నారు. కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మురుగుకాలువల్లో సిల్టు తొలగింపు

- చెత్త, చెదారం మురుగుకాలువల్లో వేయొద్దు
- ప్రజలకు ఏఎంహెచ్ఓ డాక్టర్ రామకోటేశ్వరరావు విజ్ఞప్తి



సిల్టు తొలగింపు పనులు పరిశీలిస్తున్న ఏఎంహెచ్ఓ డాక్టర్ రామకోటేశ్వరరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ చెత్తచెదారాన్ని పారిశుద్ధ్య సిబ్బంది సూచించిన ప్రాంతాలలోనే వేయాలని, మురుగుకాలువల్లో వేయవద్దని ఏఎంహెచ్ఓ డాక్టర్ వి.రామకోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. నగరంలోని పలు ప్రాంతాలలో సిల్ట్ తొలగింపు పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మురుగు కాలువలు సక్రమంగా పారేందుకు సిల్ట్‌ను తొలగిస్తున్నామన్నారు. సిల్ట్ ఉండటం వల్ల మురుగు నిలిచిపోయి దుర్వాసనతో పాటు దోమలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. ముందస్తు జాగ్రత్తగా తాము సిల్ట్ తొలగింపు పనులు చేపట్టామని, ప్రజలు సహకరించాలని కోరారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి




కంచికచర్లలోని గ్రంథాలయంలో చదరంగం ఆడుతున్న విద్యార్థులు

కంచికచర్ల: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తోందని, ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని కంచికచర్ల గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40 రోజుల నుంచి ఈ శిబిరాలను చిన్నారుల మెదడుకు పదును పెట్టేందుకు రాష్ట్ర పౌర శాఖ ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు విజ్ఞానం, వినోదం, పుస్తక పఠనం, యోగా, నృత్య ప్రదర్శన, చిత్రలేఖనం, జాతీయ నాయకుల పేర్లను తెలుసుకోవడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. దీంతో వారి తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్రాంత గ్రంథాలయాధికారి రంగిశెట్టి వెంకటేశ్వర్లు, కవి, రచయిత నీలం సర్వేశ్వరరావు, యోగా గురువు ఎం.మల్లికార్జునరావు, ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు, డాన్స్ మాస్టర్ బిట్ర రాహుల్ కుమార్, మేడూరు మాణిక్యాలరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 స్థాయి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ పేర్కొన్నారు. ఈ సమ్మర్ క్యాంపులో పలువురు ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు పలు అంశాల గురించి బోధిస్తూ వాటికి సంబంధించిన విజ్ఞానం పట్ల అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులతో పుస్తక పఠనం, పొడుపు కథలు చెప్పించడం, కథల పోటీలు, నృత్య శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దోసపాటి నాగేశ్వరరావు, వినోద్‌బాబు, అల్లి చంద్రశేఖర్, గ్రంథాలయ సిబ్బంది సత్యవతి, శ్యామల, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో ప్రతిభ చూపిన కేబీఎన్ షైన్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాకరపర్తి భావనారాయణ కళాశాల షైన్ విభాగం విద్యార్థులు ఇటీవల ప్రకటించిన నీట్ పరీక్షలో అద్భుతమైన ప్రతిభను చూపారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. నీట్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఐదుగురు మెడికల్ సీట్లు సాధించే ర్యాంకులను పొందారని చెప్పారు. 97.6 శాతంతో శివాన్ష్ షా ఎంబీబీఎస్ సీటుకు, 493 మార్కులతో జి.భారతి, 440 మార్కులతో ఇ.వెంకటేశ్వరరావు బీడీఎస్ సీట్లను సాధించే అవకాశముందని తెలిపారు. షేక్ ఆస్మా, ఎం.సాయిశ్రావంతి బీఏఎంఎస్‌లు సీట్లు సాధించే అవకాశముందని అన్నారు. చాలా తక్కువ మంది విద్యార్థులతో తమ కళాశాల అద్భుతమైన మార్కులను సాధించినట్లు తెలిపారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అభినందించారు. కార్యక్రమంలో టి.నరేంద్రకుమార్, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



చిట్టేలలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తిరువూరు: మండలంలోని చిట్టేలలో గురువారం ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యాయులు గ్రామంలో పర్యటించి బడి ఈడు పిల్లలను గుర్తించారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్య ప్రాధాన్యతను వారికి వివరించారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులను పనులకు పంపవద్దని, విద్యాహక్కు చట్టం ప్రకారం పిల్లలను ఇతర పనులకు పంపడం నేరమని చెప్పారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

బాలుడికి ఆర్థిక సాయం అందజేత



తిరువూరు: మండలంలోని గానుగపాడుకు చెందిన పదో తరగతి విద్యార్థి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అతని వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. గానుగపాడుకు చెందిన షేక్ నాగుల్‌మీరా జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో చదువుతుండగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. అతనికి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని శ్రీనివాసరావు అందజేశారని కుటుంబసభ్యులు తెలిపారు.